చకచకా మెట్రో పనులు..!

- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మాణం
- పాతబస్తీలో మొదలైన అలైన్‌మెంట్ పిల్లర్ల మార్కింగ్
- మరోవైపు శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు
- మీరాలంమండి వద్ద స్టేషన్ కోసం స్థానికుల డిమాండ్

చార్మినార్: పాతబస్తీ మెట్రో రైలు పనులు చకచకా సాగుతున్నాయి. బుధవారం ఎక్కడెక్కడ ఏయే పిల్లర్లు వస్తాయోననే అవగాహన కోసం అలైన్‌మెంట్ పిల్లర్ల మార్కింగ్ చేపట్టారు. మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి మొదలైన పిల్లర్ల మార్కింగ్ దారుషిఫా గ్రౌండ్ రోడ్డు వద్ద 41వ పిల్లర్‌గా మార్కింగ్ చేశారు. అలాగే పురానీహవేలీ ఆషుర్‌ఖానా రోడ్డు వద్దకు వచ్చేసరికి 60వ నంబర్‌గా మార్కింగ్ వచ్చింది. ఇలా చాంద్రాయణగుట్ట వరకు దాదాపు 300 పిల్లర్లు వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. మరోవైపు రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రధాన రోడ్డుకిరువైపులా గృహ, వ్యాపార సముదాయాలను తొలగించారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో తొలగించాల్సి ఉంది.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

సీఎం ఆదేశాల మేరకు పాతబస్తీలో మరోవైపు మెట్రో రోడ్డు విస్తరణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఇటీవల పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి మెట్రో రైలు పనులను పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగిస్తున్న నివాస, వ్యాపార సముదాయాల భవనల కూల్చివేతల వివరాలతో పాటు ఇతర అంశాలను సంబంధిత మెట్రో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మున్సిపల్ ముఖ్య కార్యదర్శి ఇలంబర్తి, గ్రేటర్ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే పరిస్థితులను అంచనా వేసారు.


అలైన్‌మెంట్ పిల్లర్ల కోసం మార్కింగ్ చేస్తున్న మెట్రో సిబ్బంది

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు..

ఫలక్‌నుమా నుంచి ఎంజీబీఎస్ ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పుడు ఫలక్‌నుమా వరకు కాకుండా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌ను పొడిగించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎట్టకేలకు మీరాలం మండి, దారుషిఫా, ఎతేబార్ చౌక్, శాలిబండ, శంషీర్‌గంజ్ ద్వారా ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులు వేగంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం దారుషిఫా చౌరస్తా నుంచి పురానీహవేలీ, మీరాలం మండి, కోట్ల అలీజాతో పాటు మొగల్‌పురాలోని బీబీబజార్ చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా వ్యాపార సముదాయాలు తొలగిస్తున్నారు. చాంద్రాయణ గుట్ట నుంచి ఆర్జీఐఏ వరకు మెట్రో కారిడార్ కొనసాగనున్నది.

మీరాలంమండి వద్ద స్టేషన్ ఏర్పాటు చేయాలి



మీరాలంమండి కూరగాయల మార్కెట్‌తో పాటు మహంకాళేశ్వర ఆలయం ఇక్కడ ఉండడంతో మీరాలం మండి వద్ద మెట్రో స్టేషన్ ఏర్పాటు చేయాలి. అంతేగాకుండా స్టేషన్ ఏర్పాటుతో పాత పోలీసు కమిషనరేట్ కార్యాలయంతో పాటు దక్షిణ మండలం డీసీపీ,సి టీ సివిల్ కోర్టు తదితర కార్యాలయాలకు వెళ్లే వారికి కూడా సౌకర్యంగా ఉంటుంది. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని మీరాలంమండి టెంపుల్ పేరుతో మెట్రో స్టేషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

-రాజుల అంజయ్య, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్

ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర మంత్రి జి.వివేక్ సూచించారు. షేక్‌పేట్‌లో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానికులకే కాంగ్రెస్ టికెట్ కేటాయిస్తుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్‌కు రూ. 20 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేయిస్తానన్నారు. అభ్యర్థి ఎవరైనా సరే అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే తప్పకుండా ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ అజారుద్దీన్, షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, నాయకులు మోహిన్, ప్రీతీ, రాజు, సోని, రమేశ్, రఘు, మక్బూల్, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మంత్రి వివేక్

'కిడ్నీ కేర్' పుస్తకావిష్కరణ

గోల్కొండ: ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ మహ్మద్ షోహెబ్ అహ్మద్ ఖాన్ రాసిన 'కిడ్నీ కేర్' పుస్తకాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులు, జాగ్రత్తలు, డయాలసిస్ తదితర విషయాలపై సమగ్రంగా బుక్ రాయడం అభినందనీయమన్నారు. టోలిచౌకీ సాలర్‌జంగ్ కాలనీలోని సాప్ కిడ్నీ సెంటర్‌లో ఈ పుస్తకాన్ని ఉచితంగా అందుబాటులో ఉంచామని సాప్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ నియాజ్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో సాప్ గ్రూప్ మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ ఆకీబ్ అహ్మద్ ఖాన్, మహ్మద్ అసన్ అహ్మద్ ఖాన్ తదితరులు ఉన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వినోద్ గణేశ్


వినోద్ గణేశ్‌తో అధ్యాపకులు, సిబ్బంది

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎం.వినోద్ గణేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్ టి.గంగాధర్ బుధవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్ వినోద్ గణేశ్ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న ఆధునిక పద్ధతులను విద్యార్థులకు తెలియజేసి వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా అధ్యాపకులతో కలిసి ప్రణాళికలు రూపొందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్లు చిన్నసైదులు, సీహెచ్ శ్రీనివాస్, రామకృష్ణ, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకం అందజేత


పుస్తకం అందుకుంటున్న చంద్రశేఖర్

చాంద్రాయణగుట్ట: బీజేపీ సీనియర్ నాయకుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తన జీవిత చరిత్రపై 'ప్రజల కథే నా ఆత్మ కథ' పేరుతో రచించిన పుస్తకాన్ని రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్‌కు బుధవారం అందజేశారు. అహర్నిశలు పేదల బాగు కోసమే పరితపించే బండారు దత్తాత్రేయ తన జీవిత చరిత్ర పుస్తకాన్ని స్వయంగా అందించడం ఆనందంగా ఉందని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన


పరిశీలిస్తున్న ఉదయ్ కిరణ్ రెడ్డి తదితరులు


చాంద్రాయణగుట్ట: యూనియన్ బ్యాంక్ నుంచి రాజన్నబావి వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకుడు ఉదయ్ కిరణ్ రెడ్డి సీనియర్ నాయకుడు నరేశ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. గుంతలమయంగా మారిన ఈ రహదారి మరమ్మతుల విషయమై పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు ఫస్టియర్ కీలకం


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి


గోల్కొండ: డిగ్రీ కోర్సులో మొదటి సంవత్సరం ఎంతో కీలకమని గోల్కొండ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి అన్నారు. కళాశాలలో ఫస్టియర్ విద్యార్థినులకు బుధవారం ఓరియంటేషన్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ నుంచి డిగ్రీలో చేరే విద్యార్థినులు మొదట్లో ఆందోళన చెందుతారని అలాంటి వారిలో ఆత్మీయ భరోసా కల్పించాల్సిన బాధ్యత సీనియర్లపై ఉంటుందన్నారు. అదేవిధంగా అధ్యాపక బృందం సైతం ఫ్రెషర్స్‌కు కళాశాల నియమ నిబంధనలను తదితర వాటిని వివరించాలని సూచించారు. ర్యాగింగ్ పూర్తిగా నిషేధమని ఈ విషయాన్ని సీనియర్లు గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీ కోఆర్డినేటర్ ఎన్.ఎస్.రజనీశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుమేరా సైయిద్, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో బండారు దత్తాత్రేయ పర్యటన



అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గంలోని ధూల్‌పేట, బేగంబజార్ ప్రాంతాల్లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తల ఇండ్లకు వెళ్లారు. ధూల్‌పేట్‌లోని లక్ష్మణ్‌సింగ్ ఇంటికి వెళ్లి గంటకు పైగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన రాసిన పుస్తకాలను కార్యకర్తలు, నాయకులకు అందించారు. గోషామహల్ ఏసీపీ సుదర్శన్ ఆధ్వర్యంలో మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ బందోబస్తు పర్యవేక్షించారు.

బీబీసీ ఏఓగా బిషప్ భాస్కర్



గన్‌ఫౌండ్రీ: భారత్ బైబిల్ కాలేజ్ (బీబీసీ) అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఎం.భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు బుధవారం నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా బిషప్ భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానని, పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో ముందుకు వెళ్తానని తెలిపారు. విభేదాలను పరిష్కరించి అందరిని సమన్వయం చేసుకుంటూ కళాశాల అభివృద్ధికి పాటుపడుతానని పేర్కొన్నారు.

సమాజ సేవలో 'మార్వాడీ యువ మంచ్'


మాట్లాడుతున్న పురుషోత్తంరావు

అబిడ్స్: సమాజ సేవలో మార్వాడీ యువ మంచ్ ముందంజలో ఉంటుందని గోషామహల్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు ఆల పురుషోత్తం రావు పేర్కొన్నారు. బేగంబజార్ మహేశ్వరీ భవన్‌లో మార్వాడీ యువ మంచ్ సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగించారు. గోషామహల్ నియోజకవర్గంతో పాటు తెలంగాణ నలుమూలలా మార్వాడీ యువ మంచ్ పేద, బడుగువర్గాలతో పాటు ఇతర వారికి సైతం పలు కార్యక్రమాల ద్వారా సేవలందిస్తున్నారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాంచందర్ రాజు, శ్యాంసుందర్ పహీతి, కన్నయ్య లాల్ రాఠి, హేమంత్ సర్దాలు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర నామావళి గ్రంథావిష్కరణ


కేహెచ్ఎస్ జగదాంబను సత్కరిస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి సంఘ మిత్ర కేహెచ్ఎస్ జగదాంబ రచించిన శ్రీ కాశేశ్వర నామావళి అనే గ్రంథావిష్కరణ సభ బుధవారం జరిగింది. పింగలి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, డాక్టర్ అనంత లక్ష్మి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గ్రంథం రచయిత్రి ఎంతో ఆధ్యాత్మిక భావనతో రచించారన్నారు. కార్యక్రమంలో గీత శివ రాం, సూరి సీతారాం, సంస్థ అధ్యక్షుడు రామచంద్రా రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ లలితావాణి, కన్వీనర్ శ్యామలరావు, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'యువజన అవగాహన, మహిళా సాధికారత'పై వర్క్‌షాప్

సుల్తాన్‌బజార్: సహకార సంఘాల అంతర్జాతీయ సంవత్సరం 2025 సందర్భంగా కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో 'యువజన అవగాహన, మహిళా సాధికారత'పై బుధవారం వర్క్‌షాప్ జరిగింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్, ఉమెన్స్ స్టడీ సెంటర్ సహకారంతో సహకార భావన ద్వారా సమాజ అభివృద్ధి, యువత సాధికారత, మహిళాశక్తి వికాసం లక్ష్యంగా వర్క్‌షాప్ నిర్వహించామని వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ తెలిపారు. అలాగే కో ఆపరేటివ్ సంఘం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ లోకపావని, రత్నకుమారి, కరుణాకుమారి, డాక్టర్ బీ ప్రసాద్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న వీసీ సూర్య ధనుంజయ్

'గృహ నిర్బంధం సరైంది కాదు'

చార్మినార్: బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ గుడికి వెళ్లకుండా మీర్‌చౌక్ పోలీసులు బుధవారం ఉదయం తనను హౌజ్ అరెస్టు చేశారని రాష్ట్ర బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా పెద్దమ్మ గుడి వద్ద నిరసనకు పార్టీ పిలుపునివ్వడంతో అక్కడికి వెళ్లే ప్రయత్నం చేసిన తనను మీర్‌చౌక్ పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధం చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతోందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ గట్టిగా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.



సమాజ సేవే ప్రథమ లక్ష్యం

గన్‌ఫౌండ్రీ: సమాజ సేవే తన లక్ష్యమని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ పేర్కొన్నారు. లక్ష కుటుంబాలకు సాధికారత కల్పించాలనే తన సంకల్పంలో భాగంగా గన్‌ఫౌండ్రీలోని సియాసత్ ఆడిటోరియంలో 100 మంది లబ్ధిదారులకు రాయిని కోసే యంత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 34 లక్షల మంది ముస్లింలు వెనుకబడి ఉన్నారని అయినా ప్రభుత్వాలు నిధులను కేటాయించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. తన జీవితకాలంలో లక్ష కుటుంబాలకు సాధికారత కల్పించాలనే నిబద్ధతతో ముందుకు వెళ్తున్నానని తెలిపారు. త్వరలోనే మరికొంత మంది లబ్ధిదారులకు యంత్రాలను పంపిణీ చేస్తామని చెప్పారు.


యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

'అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి'

గన్‌ఫౌండ్రీ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ అవినీతి అక్రమాలపై సీబీఐ, సీఐడీతో విచారణ జరపాలని తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ జగన్నాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్బీ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019వ సంవత్సరంలో అప్పటి ఎండీ దినకర్‌బాబు సంతకాన్ని ఫోర్జరీ చేసి అశోక్‌కుమార్ పదోన్నతి పొందారని ఆరోపించారు. ఈనెల 31న పదవీ విరమణ చేయనున్న అశోక్‌కుమార్ ప్రతి నెల రూ.50 వేల ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారని ఆరోపించారు. అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్, మరో అధికారి కల్యాణి ఇద్దరు కలిసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వేసే కంపెనీని స్థాపించి లక్షల రూపాయాల కమీషన్లు కొట్టేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం కప్ నిర్వహణలోనూ అవకతవకలకు పాల్పడ్డారని, వీరిద్దరిపై విచారణకు ఆదేశించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి నరేందర్ యాదవ్ పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీ ఆదర్శప్రాయుడు


విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న వెంకటేశ్ చౌహాన్

గన్‌ఫౌండ్రీ: ఆదర్శవంతమైన సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్న సింగరేణి సీఎండీ బల్‌రాం నాయక్ ఎంతోమందికి ఆదర్శప్రాయుడని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ అన్నారు. సింగరేణి సీఎండీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గిరిజన శక్తి ఆధ్వర్యంలో నిజాం కళాశాల, ఎస్టీ బాలికల వసతి గృహాల్లోని విద్యార్థులకు బుధవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల తండా నుంచి వచ్చి డైనమిక్ అధికారిగా సింగరేణి సంస్థను లాభాల బాట పట్టించడం, అలాగే ఎంతో మంది నిరుపేదలకు అండగా ఉంటూ వారికి జీవిత బీమా వంటి పథకాలు కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువ తెలంగాణ పత్రిక చైర్మన్ ఎం.కిరణ్‌కుమార్, ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐతరాజు, అభియేందర్, దళిత యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కే రమేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీమాన్ నాయక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డులు అందిస్తామని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని హిందీనగర్, ఉస్మాన్‌గంజ్, తోప్‌ఖానా, రిసాలాబుల్లా, ఎంజే మార్కెట్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి బుధవారం ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డులు లేనివారికి అధికారులు కొత్తగా జారీ చేస్తారన్నారు. నాలుగో సర్కిల్ సివిల్ సప్లై అధికారులు, మున్సిపల్ అధికారులతో సర్వే చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ సుజాత, జీహెచ్ఎంసీ అధికారి నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి ఇంటింటా సర్వేలో ఎస్.ధన్‌రాజ్

ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం


డాక్టర్ సూరేపల్లి రవికుమార్

అఫ్జల్‌గంజ్: అఖిల భారతీయ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ సూరేపల్లి రవికుమార్ తెలిపారు. ధూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కవి సమ్మేళనంతో పాటు దేశభక్తి పాటలు, గేయాలుపాడే అవకాశం కూడా ఉంటుందన్నారు. ఇందులో 11 మంది కవులకు మాత్రమే అవకాశం ఉందని ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తామన్నారు. దేశభక్తి పాటలు, గేయాలు పాడేవారు, కవి సమ్మేళనం కోసం కవులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 97003 34999, 98665 97260 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: నిమ్స్ ఆస్పత్రి నుంచి పంజగుట్ట చౌరస్తా వరకు రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలతో అటు వాహనదారులు, ఇటు పాదచారులతో పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతుండడంతో ఫిర్యాదులు అందుకున్న పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామ్‌ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐలు, సిబ్బంది బుధవారం ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. రోడ్డుకు రెండువైపులా ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఆక్రమణలు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుండగా సుమారు 25 వరకు ఆక్రమణలను పోలీసులు తొలగించి క్రేన్ సహాయంతో అక్కడి నుంచి తరలించారు. మరోసారి ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు ఆక్రమణలు తొలగించడంతో ఈ రోడ్డు చాలావరకు క్లియర్ అయ్యింది.

